క్లుప్తంగా

సీసీ కెమెరాలు ఏర్పాటు

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలో లోక్‌సభ ఎన్నికలు, ఇసుక, మట్టి అక్రమ రవాణ అరికట్టేందుకు రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలను బుధవారం ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ ప్రియాంక అల ఆదేశాల మేరకు తహసీల్దార్ చంద్రశేఖర్ లక్ష్మీనగరం గ్రామ శివారులో రెండు సీసీ కెమెరాలను అమర్చారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. అక్రమ ఇసుక, మట్టి తోలకాలు జరిపితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కాగా ఈ సీసీ కెమెరాల పనితీరును నేరుగా కలెక్టరేట్ కార్యాలయంలో పర్యవేక్షించే విధంగా ఏర్పాటు చేశారు. అయితే ఈ సీసీ కెమెరాల భద్రతను, పర్యవేక్షణను రెవిన్యూ అధికారులు ఏ తీరుగా అమలుపరుస్తారోనని గ్రామస్తులు సందేహాలను వ్యక్తపరుస్తున్నారు.

కూలర్లు వితరణ



ఈఓకు జంబో కూలర్లను అందజేస్తున్న ఎస్‌బీఐ అధికారులు

భద్రాచలం: భద్రాచలం సీతారామ చంద్రస్వామి దేవస్థానానికి ఎస్‌బీఐ బ్యాంకు ఆధ్వర్యంలో రెండు జంబో కూలర్లను బుధవారం వితరణగా అందజేశారు. వీటిని ఆలయ ఈఓ రమాదేవికి అందచేసి బ్యాంకు అధికారులు మాట్లాడారు. వేసవిలో దేవస్థానంకు వచ్చే భక్తుల సాకర్యార్థం వీటిని వితరణ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మేనేజర్‌లు గోపి ఆచారి, రమేష్‌లు, ఏజీఎం శ్రీనివాస రామారావు, సిబ్బంది రామయ్య పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

అన్నపురెడ్డిపల్లి: ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం తక్షణమే ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండపల్లి శ్రీధర్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని జానకీపురం గ్రామంలో ఏర్పాటు చేసిన ఆ పార్టీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో వరి కోతలు ముమ్మరంగా కొనసాగుతున్నాయని, ధాన్యం కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో రైతులు దళారులను ఆశ్రయించి మోసపోతున్నారన్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు గిట్టుబాటు ధరతో పాటు బోనస్‌ను ప్రకటించాలన్నారు. ఐపీఎం మండల కార్యదర్శి జంగిలి వెంకటరత్నం, కోటయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆలయ ప్రారంభం

చంద్రుగొండ: మండలంలోని బాల్యతండాలో కోదండ చంద్రస్వామి ఆలయాన్ని బుధవారం పండితుల వేదమంత్రోత్సరణల నడుమ ప్రారంభించారు. నూతనంగా నిర్మించిన ఆలయంలో సీతారాములు, లక్ష్మణుడు, అంజనేయస్వామి విగ్రహాలతోపాటు ధ్వజస్తంభం ప్రతిష్ఠించారు. జీవధ్వజ శిఖర ద్వారపాలక కృష్ణనాభిశిల (బొడ్రాయి), ముక్తేశ్వరి ముత్యాలమ్మ, మరిడమ్మ, మైసమ్మ దేవతల విగ్రహాలను ప్రతిష్ఠించారు. నారాయణసేవ, గ్రామదిగ్బంధనం చేపట్టారు. ఈ సందర్భంగా భక్తులకు మహాఅన్నదానం చేశారు. విగ్రహ ప్రతిష్ఠలను పురస్కరించుకుని ఈ నెల 25 నుంచి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. అభిషేకాలు, హోమాలతోపాటు పూజలు ఈ నెల 29 వరకు కొనసాగుతాయని ఉత్సవ కమిటీ తెలిపింది.

విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

అశ్వారావుపేటరూరల్: మండలంలోని పేరాయిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని ఏఎస్ఆర్ నగర్‌లో బుధవారం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆలయంలో వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమాలు చేసి అనంతరం భక్తిశ్రద్ధలతో సంకట హర విఘ్నేశ్వర స్వామి వారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమానికి అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు హాజరై ఆలయంలో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కాగా ఆలయ నిర్మాణానికి సహకరించిన మాజీ ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించి, జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు, ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, బీఆర్ఎస్ నాయకులు మందపాటి మోహన్ రెడ్డి, సత్యవరపు సంపూర్ణ, మాజీ వార్డు సభ్యులు దాబా రాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

దమ్మపేట: తమ సమస్యలు పరిష్కరించిన స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు విద్యా వలంటీర్లు ధన్యవాదాలు తెలిపారు. బుధవారం మండలంలోని గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను గతంలో పాఠశాలల్లో పనిచేసిన విద్యా వలంటీర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఉన్నత అధికారులతో మాట్లాడి పెండింగ్ వేతనాలు చెల్లించేలా కృషి చేసినందుకుగాను విద్యా వాలంటీర్లు, ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో విద్యా వాలంటీర్ల సంఘం నాయకులు భావన, పదం శ్రీనివాస్, కొర్సా రాజేష్, రమేష్, సాయిబాబు, సూర్యప్రకాష్, సునీత, ఖదీజాబేగం తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బాకు అందని సామగ్రి

- నాలుగేళ్లుగా ఇవ్వని దుప్పట్లు, ట్రంకు పెట్టెలు
- బయట నుంచే కొనుగోలు చేస్తున్న విద్యార్థినులు
- దయనీయంగా నిరుపేదల పరిస్థితి



చర్లలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం

చర్లరూరల్: చర్లలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలోని విద్యార్థినులు సమస్యలతో సతమతమౌతున్నారు. గత నాలుగు సంవత్సరాలుగా చర్ల విద్యాలయంలో చదువుతున్న విద్యార్థినులకు దుప్పట్లు, ట్రంకు పెట్టెలతో పాటు కనీస సామగ్రి అందకపోవడంతో నానా అవస్థలు పడుతున్నారు. కరోనా కంటే ముందు విద్యార్థినులకు అవసరమయ్యే సామాన్లు సకాలంలోనే అందేవి. కానీ కరోనా వచ్చిననాటి నుంచి మాత్రం ఇప్పటి వరకు దుప్పట్లు, ట్రంకు పెట్టెలు ఇవ్వలేదు. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, ఇతర వెనుకబడిన తరగతులు, మైనారిటీ దారిద్ర్య రేఖకు దిగువనున్న కుటుంబాలకు చెందిన బాలికలకు నాణ్యమైన విద్య సాధ్యమయ్యేలా, అందుబాటులో ఉండేలా గ్రామీణ ప్రాంతాల్లో కస్తూర్బా పాఠశాలలను కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. కానీ ప్రస్తుతం చర్ల కస్తూర్బా పాఠశాలలోని విద్యార్థినులకు తమ తల్లితండ్రులు వచ్చి మరీ దుప్పట్లు, ట్రంకు పెట్టెలు ఇంకా బాలికలకు కావలసిన వస్తువులను కొనిస్తూ వస్తున్నారు. మరి కొంత విద్యార్థినులకు సామాన్లను కొని ఇవ్వలేని పరిస్థితి. కొంతమంది విద్యార్థినులకు తల్లిదండ్రులు లేరు. మరికొంతమందికి ఇద్దరిలో ఒకరు లేరు. వీరు బయట నుంచి కొనుగోలు చేసి తెచ్చుకోవడం ఇబ్బందికర విషయం. 159 మంది విద్యార్థులతో నడుస్తున్న కేజీబీవీకి సుమారు నాలుగు సంవత్సరాలుగా దుప్పట్లు, ట్రంకు పెట్టెలు రాలేదని ఈ విషయం గురించి పై అధికారులకు తెలిపామని కస్తూర్బా పాఠశాల స్పెషల్ ఆఫీసర్ సరోజిని తెలిపారు.

సామాన్లు నేనే కొనిస్తుంటా..



మా అమ్మాయి ఇక్కడే చదువుతోంది. చదువు బాగుంది కానీ కావలసిన దుప్పట్లు, ట్రంకు పెట్టెలు ఇంకా కావలసిన సామాన్లు ఇవ్వడం లేదు. ప్రతీనెలా వచ్చి వాటిని కొనిచ్చి వెళుతుంటాను. ప్రభుత్వమే అందించాల్సిన వస్తువులు ప్రభుత్వం అందించాలి.

– బట్టా వెంకటేశ్వర్లు, వెంకటాపురం

నాలుగేళ్లుగా రాలేదు..



నాలుగు సంత్సరాలుగా చర్ల కస్తూర్బా పాఠశాలలోని విద్యార్థినులకు దుప్పట్లు, ట్రంకు పెట్టెలు రాలేదు. విద్యార్థినుల తల్లిదండ్రులు కొనిచ్చి వెళ్తుంటారు. కొనుక్కోలేని స్థితిలో కొందరు ఉన్నప్పటికీ విద్యార్థినులు సర్దుబాటు చేసుకుంటున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– బి.సరోజిని, స్పెషల్ ఆఫీసర్, కేజీబీవీ, చర్ల

అధికారుల దృష్టికి తీసుకెళ్తాం..



కస్తూర్బా పాఠశాలలోని విద్యార్థినుల సమస్యలు మా దృష్టికి వచ్చాయి. వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించే విధంగా ప్రయత్నిస్తాను. బాలికలకు అవసరమయ్యే దుప్పట్లు, ట్రంకు పెట్టెలు ఇతర సామాన్లు అందరికీ అందే విధంగా చూస్తాను.

– ఝుంకీలాల్, ఎంఈఓ, చర్ల

ఇఫ్తార్ విందులో పొదెం



భద్రాచలంటౌన్: ఇఫ్తార్ విందులో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని కౌసర్ మసీద్‌లో ముస్లింలు బుధవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పొదెం వీరయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ముస్లింలకు పవిత్ర రంజాన్ మాసం శుభాకాంక్షలు తెలిపారు. ఈ పవిత్ర మాసంలో నిష్ఠగా ఉపవాసం ఉంటున్న ముస్లింలకు అల్లా దీవెనలు నిండుగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో న్లపు దుర్గాప్రసాద్, మైమూద్ ఖాన్, అహ్మద్ ఆరిఫ్, షేక్ హలీం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడికి పరామర్శ

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల యువ నాయకుడు సందీప్ రెడ్డిని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య బుదవారం పరామర్శించారు. సందీప్‌రెడ్డి గత కొన్ని రోజుల క్రితం రోడ్డుప్రమాదానికి గురై ఇంటి దగ్గర విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న పొదెం వీరయ్య పరామర్శించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పెద్దకమాలాపురం గ్రామంలో జరిగిన ఓ వివాహ కార్యక్రమంలో వీరయ్య పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వీరమాచినేని వినీల్, మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లంక అబ్బులు, డివిజన్ నాయకులు అడబాల వెంకటేశ్వరరావు, నాయకులు పిలక వెంకటరమణారెడ్డి, నటరాజ్ స్వామి, కనుబుద్ది దేవా, తోటమల్ల సుధాకర్, వసూరెడ్డి సాంబశివరావు, కొలపూడి వరుణ్, ఎంపీటీసీ సభ్యులు తెల్లం భీమరాజ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కోడి చంటి వర్ష చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువత మోసపోవద్దు

మణుగూరుటౌన్: నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం మోసపూరిత మాటలు నమ్మి మోసపోవద్దని జాతీయ వినియోగదారుల, మానవహక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు మందాడి సంజీవరావు అన్నారు. బుధవారం పీవీకాలనీలోని సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉన్నత చదువులు చదివిన నిరుద్యోగ యువత ఉద్యోగ ఉపాధి కోసం ఎదురుచూస్తూ కొందరి కేటుగాళ్ల వలలో పడి లక్షలాదిరూపాయలు పోగొట్టుకున్నారని, ఇలాంటి సంఘటనలు తమ సంఘం దృష్టికి వచ్చాయన్నారు. ఈ మధ్యకాలంలో ఉద్యోగాల పేరిట అమాయకులను మోసం చేసే వారి సంఖ్య పెరుగుతున్నందున ఎలాగైనా ఉద్యోగం సాధించాలే నిరుద్యోగుల తపన వారిని తప్పుదారి పట్టిస్తోందన్నారు. ముఖ్యంగా సింగరేణి, భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్, ఇండియన్ రైల్వే సాఫ్ట్‌వేర్ ఇండస్ట్రీలో బ్యాక్ డోర్ ద్వారా జాబ్స్, సింగరేణిలో ఆస్పత్రిలో ఔట్ సోర్సింగ్, సెక్యూరిటీ గార్డ్స్ నుంచి మొదలుకుని స్టాఫ్‌నర్స్ వరకు ఉద్యోగాలు ఇప్పిస్తామని చెబుతూ భారీగా మోసం చేసి డబ్బులు దండుకుంటున్నారన్నారు. ఏజెన్సీ ఏరియాలో అమాయకులను మోసం చేస్తున్న వారిపై జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


పాత్రికేయులకు రక్షణ కల్పించాలి



ఆర్డీఓకి వినతిపత్రం అందజేస్తున్న పాత్రికేయులు

భద్రాచలంటౌన్: మీడియా స్వేచ్ఛకు, పాత్రికేయుల హక్కులకు భంగం కలిగించే వారిపై చర్యలు తీసుకుని, పాత్రికేయులకు రక్షణ కల్పించాలని టీయుడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బీవీ రమణారెడ్డి కోరారు. చర్ల మండలంలో ఇసుక రీచ్‌లోకి మీడియా ప్రతినిధులను రాకుండా అడ్డుకోవడంతో పాటు వారిపై దాడికి చేయించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని బుధవారం భద్రాచలం ఐటీడీఏ పీఓ, ఏఎస్పీ, ఆర్డీఓ దామోదర్‌రావుకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైజింగ్ కాంట్రాక్టర్లు కొందరు అమాయక ఆదివాసీల సోసైటీ సభ్యులను రెచ్చగొట్టి మీడియాపై దాడులకు పురిగోల్పడం దారుణం అన్నారు. తమ అక్రమాలను వెలుగులోకి తెస్తున్నందుకే అక్కసుతో ఇలాంటి కార్యక్రమాలకు ఒడిగడుతున్నట్లు ఆరోపించారు. చట్టాలను తుంగలో తొక్కి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న కాంట్రాక్టర్లు మీడియాపై అవాకులు, చవాకులు పేలడం తగదని ఆయన హెచ్చరించారు. ఇలాంటి అక్రమార్కులకు కొమ్ముకాస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. మొబగాపు ఆనంద్‌కుమార్, శ్రీహరి, పిల్లి రాజు, సత్యానంద్, కృష్ణ, రాజాకిరణ్, నాయుడు, సతీష్, దుర్గారెడ్డి, రాజేష్, బాలాకిరణ్, వాసు, జయరాం పాల్గొన్నారు.

కల్వర్టు వద్ద మట్టి పోశారు..



గుంతల్లో మట్టి పోసిన దృశ్యం

అశ్వారావుపేటరూరల్: రహదారి విస్తరణ పనుల్లో భాగంగా నిర్మించిన కల్వర్టు వద్ద ఎట్టకేలకు బుధవారం మట్టి వేసి గుంతను పూడ్చివేశారు. అశ్వారావుపేటలోని భద్రాచలం మార్గంలో రహదారి విస్తరణలో భాగంగా మూడు నెలల క్రితం స్థానిక దొంతికుంట చెరువు దగ్గర కల్వర్టు నిర్మాణాన్ని చేపట్టి, గుంతలో మట్టి వేయకుండా వదిలేసిన సంగతి తెలిసిందే. దీనిపై ఈ నెల 12న 'ప్రమాదకరంగా విస్తరణ' శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. సమస్యపై ఎట్టకేలకు అధికారులు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా కల్వర్టు ఇరువైపులా ఉన్న గుంతలను మట్టి వేసి పూడ్చివేశారు. కాగా కల్వర్టు పునాదుల్లో నాణ్యమైన మట్టి వేయాల్సి ఉండగా, నాసిరకమైన మట్టితో నింపడం పట్ల విమర్శలు వినిపించాయి.

నవమి పనులపై నేడు సమీక్ష

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని శ్రీసీతారామ చంద్ర స్వామివారి దేవస్థానంలో నిర్వహించే స్వామివారి కల్యాణం, పట్టాభిషేకం వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లపై గురువారం డివిజన్ స్థాయి సమీక్ష నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ దామోదర్‌రావు తెలిపారు. ఉదయం 11 గంటలకు సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగే సమావేశానికి ప్రత్యేక అధికారులు నివేదికలతో హాజరుకావాలని సూచించారు.

నాయబ్‌ఖాజీ పరీక్షలో అశ్రఫ్ ఉత్తీర్ణత

చంద్రుగొండ: నాయబ్‌ఖాజీ పరీక్షలో చంద్రుగొండకు చెందిన మహ్మద్ అశ్రఫ్‌హుసేన్ ఉత్తీర్ణత సాధించారు. జామియా నిజామియా హైదరాబాద్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి నెలలో అహలే ఖిదమతే షరియా (ఇస్లామియా పదవులు)కు సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. బుధవారం ఫలితాలు విడుదలైయ్యాయి. ఈ పరీక్షల్లో నాయబ్‌ఖాజీ పరీక్షకు హాజరైన అశ్రఫ్ ఉత్తీర్ణుడయ్యారు.

ఆర్థిక సాయం

చర్లరూరల్: చర్ల మండలంలోని లింగాపురం గ్రామానికి చెందిన కొంగూరి పద్మ అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలంగాణా జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో ఫండ్ రైజింగ్ పోస్టు ద్వారా పలువురి దాతల నుంచి సేకరించిన రూ.15,500 లను పద్మ భర్త రాముకు డిప్యూటీ తహసీల్దార్ భరణిబాబు చేతుల మీదుగా అందించారు. పేద కుటుంబాలను ఆదుకోవడంలో ముందుంటున్న మాల మహానాడు చర్ల సభ్యులను ఆయన అభినందించారు. రాష్ట్ర నాయకులు తడికల లాలయ్య,జాతీయ మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోటమళ్ళ రమణమూర్తి, గౌరవ అధ్యక్షుడు మోతుకూరి ప్రభాకర్, జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ ఎడెల్లి గణపతి, దొడ్డా ప్రభుదాస్, నీలి ప్రకాష్, తోటమళ్ల వరప్రసాద్, రుంజా రాజా, చరణ్ పాల్గొన్నారు.

'టెట్' ఫీజు తగ్గించాలి

గుండాల: నిరుద్యోగులపై భారం పడకుండా పెంచిన టెట్ పరీక్ష ఫీజును తగ్గించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్‌కె.షాహీద్ బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. గతంలో ఒక పేపర్‌కు రూ.200, రెండు పేపర్లకు రూ.300లు ఉండగా, ఇప్పుడు పేపర్‌కు రూ.1000, రెండో పేపర్‌కు రూ.2వేలు పెంచడం సరైంది కాదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పరీక్ష ఫీజులు తగ్గించి, పోటీ పరీక్షలు నిర్వహిస్తామని ప్రకటించి, ఎన్నికల హామీలకు విరుద్ధంగా ఫీజులు పెంచడం విరమించుకోవాలని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిరుద్యోగులు ఇబ్బందులు పడ్డారని, ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలబడి, ఫీజులు తగ్గించాలని డిమాండ్ చేశారు.

వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే

మణుగూరురూరల్: పినపాక నియోజకవర్గ పర్యటనలో భాగంగా పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు బుధవారం మండలంలో జరిగిన పలు శుభాకార్యాల్లో పాల్గొన్నారు. మండలంలోని పివికాలనీ కమ్యూనిటీహాల్‌లో జరిగిన ఇన్న రాంబాబు-శ్రీదేవి దంపతుల కుమార్తె అనూష-నాగమల్లేశ్వరరావుల, సీతానగరం గ్రామంలో వరికిల్ల బాబురావు-సావిత్రి దంపతుల కుమారుడు సతీష్-మౌనికల వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఎజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలపై నిర్లక్ష్యం వద్దు



మాట్లాడుతున్న అదనపు పీడీ నల్లబోతుల రవి

అశ్వారావుపేటరూరల్: జాతీయ ఉపాధి హామీపథకం కింద పనులు చేసే కూలీల పట్ల నిర్లక్ష్యం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని డీఆర్‌డీఏ అదనపు పీడీ నల్లబోతుల రవి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈజీఎస్ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్‌లకు ఒక రోజు శిక్షణా శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు పీడీ మాట్లాడుతూ.. పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించడం, నిర్ధారిత వేతనం పడేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత సాంకేతిక సహాయకులదేనని చెప్పారు. పని ప్రదేశంలో కూలీలు కనీసం నాలుగు గంటలు పని చేయించేలని, రోజు వేతనం రూ.272 రూపాయాలు పొందేలా చూడాలని సూచించారు. పని ప్రదేశాల్లో తప్పనిసరిగా తాగునీరు, నీడ, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జి.శ్రీనివాసరావు, ఏపీఓ నరేష్, దమ్మపేట ఏపీఓ సుధాకర్, ఈసీ స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

ముసలమ్మ జాతర ప్రారంభం

గుండాల: ఈసం వంశీయుల ఇలవేల్పు దూలుగొండ ముసలమ్మ (దేవత) జాతర బుధవారం రోళ్లగడ్డలో ఘనంగా ప్రారంభించారు. ఈసం, మాడె వంశీయులు, పూజారులు, వడ్డెలు ప్రత్యేక పూజలతో మండ మెలుగుట, గుడి మెలుగుట కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం దేవతను గద్దెలపై ప్రతిష్టించడం జరుగుతుందన్నారు. నిండు జాతర ప్రారంభమవుతుందన్నారు. శుక్రవారం మొక్కులు చెల్లించు కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గిరిజన సాంప్రదాయాలతో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ మూడు రోజుల పాటు జరిగే జాతరకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు.

లక్ష్మీదేవి జాతర..

గుండాల: మండలంలోని తూరుబాక గ్రామంలోని జోగ వంశీయుల ఇలవేల్పు అయిన లక్ష్మీదేవి జాతరను బుధవారం పూజారులు, జోగ వంశీయులు ప్రారంభించారు. గురువారం ఉదయం అమ్మవారి ప్రతిష్ఠాపనము, కుంకుమ పూజలు చేస్తారు. రాత్రి గుడిమేలుకొలువు నిర్వహించారు. పూజారులు ప్రత్యేక పూజలు చేశారు. లక్ష్మీదేవీ ఆభరణాలను గర్భగుడినుంచి తెచ్చి వాటికి పూజలు జరిపారు. గ్రామంలో అమ్మవారి ఊరేగింపు కార్యక్రమంతో పాటు, గంగాస్నానం, గిరిజన సాంప్రదాయం ప్రకారం నాట్యప్రదర్శన ఉంటుందని పూజారులు తెలిపారు. ఆదివారం దేవతకు శుంకు పండుగ, మొక్కులు చెల్లింపు కార్యక్రమం ఉంటుందన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఆర్‌సీఓ

భద్రాచలంటౌన్: ప్రభుత్వం గిరిజన గురుకులాలకు మెరుగైన సౌకర్యాలను కల్పిస్తోందని, విద్యార్థినులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అవరోధించాలని భద్రాచలం గిరిజన గురుకులాల ఆర్‌సీఓ తుమికి వెంకటేశ్వర రాజు అన్నారు. స్థానిక గిరిజన గురుకులాన్ని ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలంచారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆయన మాట్లాడుతూ.. ఉన్నతమైన విద్యను గిరిజన గురుకులాల్లో అందజేస్తున్నట్లు తెలిపారు. కళాశాలలో జరుగుతున్న ఎంసెట్, జేఈఈ తరగతుల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ దేవదాసు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటి తొలగింపునకు చర్యలు



ములకలపల్లి సెంటర్‌లో కాలువ పనులు..

ములకలపల్లి: ములకలపల్లిలో మురుగునీటి తొలగింపుకు అధికారులు చర్యలు చేపట్టారు. ములకలపల్లిలో ఇటీవల సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులు చేపట్టారు. దీనిలో భాగంగా ఆర్అండ్‌బీ పరిధిలోని ఇళ్ల ఎదుటగల అరుగులు, సిమెంటు నిర్మాణాలను యంత్రాల సహాయంతో తొలగించారు. ఈ తరుణంలో స్థానికులు ఏర్పాటు చేసుకున్న మురుగునీటి కాలువ ధ్వంసమైంది. దీంతో చికెన్‌సెంటర్లు, హోటళ్లు, ఇళ్లు, ఇతర వ్యాపారాలకు చెందిన మురుగునీటి రోడ్డుపైకి వస్తోంది. ఈనీరంతా బీటీ రోడ్డుపై నిల్వ ఉండడంతో దుర్వాసన వస్తోంది. లారీలు, ఆటోలువంటి వాహనాలు వస్తున్న క్రమంలో మురురునీరు చింది పాదచారులపై పడుతోంది. ఈ ఉదంతంపై 'దుర్గంధం వెదజల్లుతోంది..' శీర్షికన సోమవారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైన విషయం విదితమే. స్పందించిన సంబంధిత శాఖ అధికారులు సత్వర చర్యలు చేపట్టారు. జేసీబీ సహాయంతో మరలా కాలువ తీయిస్తున్నారు. రోడ్డుపై మురుగునీరు నిల్వ ఉండకుండా బస్టాండ్ సెంటర్ నుంచి తాత్కాలికంగా కాలువ తవ్వించి, మురుగు తరలింపు చేపడుతున్నట్లు ఆర్అండ్‌బీ ఏఈ లక్ష్మానాయక్ 'సాక్షి'కి తెలిపారు. స్థానికులు అసౌకర్యం కలుగకుండా జాగ్రత్త తీసుకుంటున్నట్లు తెలిపారు.

కనీస వేతనాలు చెల్లించాలి

మణుగూరుటౌన్: పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా నాయకులు సత్రపల్లి సాంబశివరావు అన్నారు. బుధవారం సీఐటీయూ మణుగూరు కమిటీ ఆధ్వర్యంలో పెట్రోల్ బంకులు, కార్ షోరూం, బట్టల దుకాణాల్లో పనిచేస్తున్న కార్మికులతో మాట్లాడి వారి సమస్యలు విని సంతకాల సేకరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెరిగిన ధరలకు అనుగుణంగా 26 వేలకు తగ్గకుండా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హేమంతరావు, ప్రసాద్, వినోద్, సాయికుమార్, కార్మికులు పాల్గొన్నారు.

ఇసుక లారీలతో ట్రాఫిక్ ఇక్కట్లు



ఇసుక లారీల పార్కింగ్‌తో నిలిచిన వాహనాలు

మణుగూరురూరల్: మండల పరిధిలోని సాంబాయిగూడెం గ్రామంలో ఇసుక ర్యాంపు నుంచి ఇసుక రవాణా జోరుగా కొనసాగుతోంది. నిత్యం వందలాది లారీలు, ట్రాక్టర్లతో ఇసుక రవాణా జరుగుతోంది. కాగా ఇసుక లోడింగ్, రవాణా కోసం లారీలను, ట్రాక్టర్లను మణుగూరు-ఏటూరు నాగారం ప్రధాన రహదారి వెంబడే నిలుపుదల చేస్తున్నారు. సింగిల్ రోడ్డు కావడంతో ఇలా ఇసుక వాహనాలను రోడ్డుకు ఇరువైపులా నిలుపుదల చేయడంతో ఇతర వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయంగా మారింది.

ఏదైనా భారీ వాహనం అటుగా వస్తున్న క్రమంలో ట్రాఫిక్ భారీగా నిలిచిపోయే పరిస్థితి ఏర్పడుతోంది. గంటలకొద్ది వాహనాలను నిలుపుదల చేయడంతో వాహనాల్లోని ఆటో, కారు, బస్ ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఇసుక ర్యాంపు నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగా రోజూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ర్యాంప్ నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వాహనాలను రోడ్డు ప్రక్కనే నిలుపుదల చేయించడం వల్లనే ప్రతీ రోజూ ఇబ్బందులు పడుతున్నామని పలువురు వాహనాదారులు, స్థానిక గ్రామస్తులు మండిపడుతున్నారు. ఇప్పటికే ప్రమాదాలకు నిలయంగా మారిన రహదారిగా పేరొందిన మణుగూరు-ఏటూరు నాగారం ప్రధాన రహదారి.. ఈ ఇసుక ర్యాంపు నిర్వహణతో సాంబాయిగూడెం వద్ద మరింత ప్రమాదభరితంగా దర్శనమిస్తోందని ప్రయాణికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇసుక లారీలను రోడ్డుకు ఇరువైపులా నిలుపకుండా, వాహనాల రాకపోకలకు అంతరాయం లే కుండా తగిన చర్యలు చేపట్టాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.